క్లుప్తంగా

రహదారి గుంత పూడ్చివేత



రహదారి గుంతను పూడ్చుతున్న యువత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట నుంచి కేదారిపురం వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డులోని టొంగల్‌గెడ్డ వంతెన సమీపంలో ఏర్పడిన గుంతను ఎస్.కె.పాడు గ్రామానికి చెందిన యువత శనివారం కాంక్రీట్‌తో పూడ్చివేశారు. రహదారిపై ఏర్పడిన గుంత కారణంగా వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురౌతున్నారు. అయిప్పటికీ సంబంధిత అధికారులు స్పందిచకపోవడంతో యువత ముందుకొచ్చి గుంతను పూడ్చారు. యువకులను ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

గుమ్మలక్ష్మీపురం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య పిలుపునిచ్చారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా శనివారం జాతీయ సేవా శిబిరం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో 23 కొబ్బరి మొక్కలు నాటారు. విద్యార్థులు పలుగు-పార చేతపట్టి మొక్కలు నాటేందుకు గోతులు తవ్వారు. వర్మీకంపోస్ట్, చెద నివారణ ద్రావణం గోతుల్లో వేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి మొదటి సంతకానికి మోక్షమెప్పుడో..

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఏఎన్‌ఎంల నియామకానికి సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేసిన మొదటి సంతకానికి మోక్షమెప్పుడని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అనారోగ్య కారణాలతో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వరుసగా మృతి చెందుతున్నా గిరిజన శాఖ మంత్రి, సంబంధిత అధికారులు స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతూ మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాధ్యతల స్వీకరణ



ప్రయాగమూర్తి



కళాధర్

పాలకొండ రూరల్: ప్రజల సహకారంతో శాంతిభద్రతల నిర్వహణకు కృషిచేస్తామని ఎస్సై ప్రయాగమూర్తి అన్నారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన ఎస్.ప్రశాంత్‌కుమార్ వీఆర్‌కు వెళ్లడంతో జిల్లా కేంద్రంలోని దిశ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రయాగమూర్తి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

వీరఘట్టం: వీరఘట్టం ఎస్సైగా జి.కళాధర్ శనివారం విధుల్లో చేరారు. పార్వతీపురంలో సీసీఎస్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై కోరారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

కొమరాడ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పార్వతీపురం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శుక్రవారం రాత్రి కొమరాడ వద్ద పట్టుకున్నారు. వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాలను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసుల నమోదు చేసినట్లు ఎస్సై కె.నీలకంఠం చెప్పారు.

మద్యం సీసాల పట్టివేత

బలిజిపేట: మండలంలోని సుభద్ర గ్రామానికి చెందిన ఓ మహిళ 50 మద్యం సీసాలు తరలిస్తూ పట్టుబడిందని ఎస్సై పాపారావు తెలిపారు. పోలీసులు తెలియజేసిన వివరాల మేరకు.. సుభద్ర జంక్షన్ వద్ద పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపడుతుండగా.. గ్రామానికి చెందిన మహిళ ద్విచక్ర వాహనంపై 50 మద్యం సీసాలు తీసుకువస్తూ పట్టుబడింది. మద్యం సీసాలతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై పాపారావు తెలిపారు.



ప్రత్యేక రక్షణ కల్పించాలి

మహిళా వైద్యులకు ప్రత్యేక భద్రత అవసరం. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం పనిచేస్తున్నాం. కాబట్టి ప్రత్యేక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. భరోసా ఉంటే మరింత మెరుగైన వైద్యసేవలు అందించడానికి వీలవుతుంది.

-ఎస్.చాందిని, వైద్యాధికారి, కుసిమి పీహెచ్‌సీ



పోలీస్ ఔట్‌పోస్టు అవసరం..

ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీస్ ఔట్‌పోస్టు ఆవశ్యకత ఎంతైనా ఉంది. యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టాలి. సమస్యలు తలెత్తినప్పుడే ఈ ప్రస్తావన వస్తుంది. ఆపై చర్యలు ఉండకపోవడం అన్యాయం. స్థానిక ఆస్పత్రిలో ఏడుగురు మహిళా వైద్యులున్నారు. వారందరికీ భద్రత కల్పించాల్సి ఉంది.

– డాక్టర్ రౌతు భారతి, స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణురాలు, పాలకొండ ఏరియా ఆస్పత్రి



ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

సీతంపేట: ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని తహసీల్దార్ అప్పలరాజు అన్నారు. ఐటీడీఏ సీలో శనివారం వీఆర్వోలు, వీఏఏలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ-క్రాప్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. పీహెచ్‌ఓ గణేష్ మాట్లాడుతూ కొత్తరకం ఫైనాపిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, వాటిని సాగు చేసేలా చూడాలన్నారు.

ఈ-పంటతో రైతుకు మేలు

- ప్రారంభమైన పంట నమోదు
- సెప్టెంబర్ 15 వరకు గడువు



ఉల్లిభద్రలో ఈ-క్రాప్ నమోదుచేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: ఈ-పంట నమోదు(ఈ-క్రాప్ బుకింగ్)తో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలన్నా, పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు విక్రయించాలన్నా, ప్రకృతి విపత్తుల కారణంగా పంటనష్టం జరిగితే ప్రభుత్వం నుంచి పరిహారం పొందాలన్నా ఈ-పంట నమోదు తప్పనిసరి. ఈ పంట నమోదుతో కలిగే ప్రయోజనాలపై రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సెప్టెంబర్ 15లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. కాగా, ఈ ఖరీఫ్ సీజన్‌లో మండల వ్యాప్తంగా 18,200 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి 13వేల ఎకరాలలో, అరటి 1,050 ఎకరాలు, పామాయిల్ 800 ఎకరాలు, గోగు 400 ఎకరాలు, కూరగాయలు 40 ఎకరాలు, రాగులు 40 ఎకరాల్లో సాగు చేస్తుండగా, మిగిలిన విస్తీర్ణంలో జీడి, మామిడి తోటలు సాగుచేస్తున్నట్లు అధికారుల అంచనా.

పంటల నమోదు తప్పనిసరి

పంటలు సాగు చేసిన తరువాత ప్రతీ రైతు ఈ-పంటలో వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఇందుకోసం రైతులు తమ వద్ద ఉన్న పట్టాదారు పాసుపుస్తకం, 1బీ, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకంతో గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలి. పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న సర్వే నంబర్లన్నీ ఆన్‌లైన్‌లో నమోదై ఉండాలి. రైతులు తాము సాగు చేస్తున్న పంటలకు బదులు వేరే పంటలను ఈ-పంటలో నమోదు చేయిస్తే భవిష్యత్‌లో పంట ఉత్పత్తులను విక్రయించే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఈ-క్రాప్‌తో ఉపయోగాలు

- పంటలను ఈ-పంటలో నమోదు చేయడం వల్ల గ్రామ, మండల స్థాయిలో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారో తెలుసుకోవచ్చు.
- కరువు పరిస్థితులు ఏర్పడినపుడు ఏయే పంటలకు నష్టం వాటిల్లింది. ఎంత విస్తీర్ణంలో పంట నష్టం జరిగింది, ఎంత మంది రైతులు నష్టపోయాలు తదితర వివరాలు స్పష్టంగా తెలుసుకోవచ్చు.
- విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లపై రాయితీ, పంటల బీమా, అన్నదాత సుఖీభవ తదితర పథకాల నుంచి లబ్ధి పొందవచ్చు.
- మద్దతు ధరతో పంట దిగుబడులను విక్రయించే సమయంలో ఎటువంటి సమస్య లేకుండా పంట సాగు ధ్రువీకరణ పత్రం పొందడానికి వీలు ఉంటుంది.

పంట వివరాలు నమోదు చేయించుకోవాలి



రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలను ఈ- క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే పంటలకు నష్టం జరిగితే పరి హారం అందేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ-క్రాప్ సిబ్బంది నమోదు చేస్తున్నారు. సెప్టెంబ రు 15 లోపు రైతులు తాము సాగుచేస్తున్న పంటలను తప్పకుండా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలి.

– ఆర్.విజయభారతి, మండల వ్యవసాయాధికారి, గరుగుబిల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: ప్రజా దర్బార్ ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కేదారిపురం గ్రామంలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేదారిపురం, వంగర పంచాయతీలకు చెందిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ పంచాయతీలో ప్రజా దర్బారును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆమె వెంట టీడీపీ మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, జనసేన ఇన్‌చార్జ్ కె.మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, అడ్డాకుల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడిలో సస్యరక్షణపై శిక్షణ



వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇస్తున్న ఉద్యానవన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాస్‌రాజు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మండలంలోని రస్తాకుంటుబాయి కృషీ విజ్ఞాన కేంద్రం(ఆచార్యా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం)లో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలకు చెందిన రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులకు జీడిమామిడి సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై ఉద్యానవన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రాజు శనివారం శిక్షణ ఇచ్చారు. జీడిమామిడి తోటల్లో కొమ్మల కత్తిరింపు, పాటించాల్సిన ఎరువుల యాజమాన్యం, అంతర పంటలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. జిల్లా రిసోర్స్ సెంటర్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నిర్మల జ్యోతి, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం పి.షణ్ముఖరాజు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి



గుమడ వద్ద రహదారి గోతిలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, లారీ అసోసియేషన్ సభ్యులు

కొమరాడ: పార్వతీపురం నుంచి రాయఘడ వెళ్లే అంతఃరాష్ట్ర రహదారిలో ఏర్పడిన భారీ గోతులను పూడ్చాలని, రహదారి మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం రాయిగడకు చెందిన లారీ అసోసియేషన్ సభ్యులతో కలిసి శనివారం నిరసన తెలియజేశారు. గుమడ వద్ద ఏర్పడిన భారీ గోతుల్లో చేరిన బురదలో దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సాంబమూర్తి మాట్లాడుతూ.. పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా ఒడిశా, రాయ్‌పూర్, ఛత్తీస్‌గఢ్, తదితర రాష్ట్రాలకు నిత్యం వందలాది లారీలు రాకపోకలకు సాగిస్తుంటాయని, ఈ మార్గంలో భారీ గోతులు ఏర్పడటంతో వాహనాలు ఆ గోతుల్లో దిగబడి మరమ్మతులకు గురవుతున్నాయని అన్నారు. నిత్యం ట్రాఫిక్ జాం కారణంగా వందలాది వాహనాలు నిలిచిపోతున్నాయని, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాయిగడ లారీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ రాయిగడ నుంచి కూనేరు వరకు ప్రయాణం బాగుంటుందని, కూనేరు నుంచి పార్వతీపురం వెళ్లాలంటే నరకం చూస్తున్నామని వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



రన్నింగ్ వాటర్ సౌకర్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీఈఓ నారాయుడు, తదితరులు

సీతంపేట: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ డిప్యూటీ ఈఓ పి.నారాయుడు అన్నారు. బుడగరాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి చదివించాలని, ప్రత్యేక తరగతుల నిర్వహణతో పాటు వారాంతపు పరీక్షలు పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. ఆయన వెంట సీఎంఓ చిరంజీవి, తదితరులు ఉన్నారు.

90 శాతం రాయితీపై ఫైనాపిల్ మొక్కల పంపిణీ

సీతంపేట: రైతులకు 90 శాతం రాయితీపై మారిషస్ వెరైటీ ఫైనాపిల్ మొక్కలు పంపిణీ చేయనున్నట్టు ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ వి.వి.రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భామిని, సీతంపేట మండలాల్లో 110 ఎకరాల్లో ఫైనాపిల్ సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఒక్కో రైతుకు ఎకరాకు 8 వేల మొక్కలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోటోతో దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

50 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ పరిసరాల్లో 50 లీటర్ల సారా పట్టుకున్నట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు శనివారం తెలిపారు. చిన్నబగ్గ గ్రామ సందర్శనకు వెళ్తుండగా మార్గమధ్యలో ఓ వ్యక్తి సారా తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పశువుల వ్యాన్ పట్టివేత

సీతంపేట: పశువులకు ఎటువంటి సదుపాయం కల్పించకుండా తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్నట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపారు. పీఎంఆర్‌సీ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా 14 పశువులను తరలిస్తున్న బొలేరో వాహనాన్ని అడ్డుకున్నారు. పశువులకు గడ్డి, నీరు లేకుండా, వాటి కదలికలకు ఏమాత్రం ఆస్కారం లేకుండా నొప్పికలిగించే విధంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి పశువులను గోశాలకు తరలించినట్లు చెప్పారు.

వరి క్షేత్రాల పరిశీలన



రస్తాకుంటుబాయిలో వరి పొలాలను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్ర బృందం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి, పాడి గ్రామాల్లోని వరి పొలాలను శనివారం రస్తాకుంటుబాయి కృషీ విజ్ఞాన కేంద్రం (ఆచార్యా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ, జిల్లా రిసోర్స్ సెంటర్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాస్‌లతో పాటు శాస్త్రవేత్తల బృందం క్షేత్ర పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వరిలో తామర పురుగులు ఆశించినట్లు గమనించారు. దీని నివారణకు వేపాకుల కషాయంను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. సాగులో అనుసరిస్తున్న పద్ధతులను తెలుసుకుని రైతులకు పలు సూచనలు చేశారు.



ఇండస్ట్రియల్ పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ శోభిక

స్థల పరిశీలన

సీతంపేట: మండలంలోని పాతపనుకువలస సమీపంలో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక పార్కు స్థలాన్ని జేసీ శోభిక శనివారం పరిశీలించారు. అక్కడి గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ-క్రాప్ నమోదు ఎంతవరకు పూర్తయిందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ వి.వి.రమణ, తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలో సాగవుతున్న వరి పైర్లలో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించామని ఏఓ ఎస్. అవినాష్ తెలిపారు. ఈ మేరకు రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. వివిధ గ్రామాల్లో సాగులో ఉన్న వరి పైర్లను శనివారం ఆయన పరిశీలించారు. పణుకుపేట, దయానిధిపురం, రంగంపేట, గుచ్చిమి, చిన్నారాయుడుపేట, మరిపివలస గ్రామాల వరిచేనుల్లో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు ఎకరాకు 110 గ్రాముల ఫోలియర్ జింక్ పిచికారీ చేయాలని సూచించారు. పంటల వివరాలను ఈ -పంట యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

వాడీవేడిగా మండల సమావేశం

- అనధికార వ్యక్తులు రావడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ విక్రాంత్
- టీడీపీ, వైఎస్సార్‌సీపీ సభ్యుల మధ్య వాగ్వాదం



టీడీపీ, వైఎస్సార్‌సీపీ సభ్యుల మధ్య చోటు చేసుకున్న వాగ్వాదం

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. టీడీపీ ఎంపీటీసీ సభ్యులకు బదులు వారి ప్రతినిధులు సమావేశానికి హాజరవ్వడంపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టసభలకు ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరకావాలని, అంతే తప్ప వారి ప్రతినిధులు హాజరకాకూడదని చెప్పారు. దీంతో సభకు హాజరైన టీడీపీకి చెందిన నాయకులకు, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు కలుగజేసుకోవడంతో అందరూ శాంతించారు. అనంతరం సమావేశం ప్రారంభమైంది. ప్రతీ ఒక్కరూ సభా మర్యాదలు పాటించి మండల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్సీ విక్రాంత్ సభ్యులను కోరారు.

వీరఘట్టం అభివృద్ధికి కృషి చేస్తా..

సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ వీరఘట్టం మండల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. అంతకుముందు పలు శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ పరిధిలో చాలా పెండింగ్ పనులు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుంటే విద్యాశాఖ ఏం చేస్తోందని పలువురు ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె.వెంకటరమణ, తహసీల్దార్ చందక సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు విశ్వాసరాయి భార్గవ్, పత్రి విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి సందడి



ఉట్టి కొడుతున్న విద్యార్థులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీసాయి నికేతన్ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం సందడిగా సాగింది.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మనోబంధ్ ఆధ్వర్యంలో తోటపల్లి టెంపుల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు మనోబంధ్ కోఆర్డినేటర్ దశరథ రామయ్య, జట్టు ట్రస్టీ డి.పారినాయు డు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరీ చేతులమీదుగా వైద్య శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొని రోగులకు సేవలందించడంతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇసుక మేటలు తొలగించాలి: జేసీ



కాట్రగడ వద్ద ఓపెన్ హెడ్ చానల్ సైడ్‌వియ్యర్‌లో పేరుకు పోయిన ఇసుక మేటలు పరిశీలిస్తున్న జేసీ శోభిక, అధికారులు

భామిని: వంశధార నదిపై నిర్మించిన ఓపెన్ హెడ్ ఛానల్ సైడ్‌వియ్యర్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలను వంశధార ప్రాజెక్టు అధికారులే తీయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.శోభిక ఆదేశించారు. భామిని మండలం కాట్రగడ-బి వద్ద వంశధార నదిపై నిర్మించిన ఒపెన్ హెడ్ చానల్ ప్రాంతాన్ని ఐటీడీఏ పీఓ వి.వి.రమణతో కలిసి శనివారం పరిశీలించారు. వంశధార నదిలో వరద నీరు పెరిగిన సమయంలో నేరుగా సైడ్‌వియ్యర్ ద్వారా హెడ్ రెగ్యులేటర్‌కు నీరు ప్రవేశించే తీరును తెలుసుకున్నారు. ఇసుక మేటల తొలగింపునకు చేపట్టాల్సిన చర్యలపై డీఈఈ భవానీశంకర్‌తో చర్చించారు. అనంతరం ఏపీఎండీసీ ఏజీ కుమారస్వామితో కలిసి ఇసుక స్టాక్ పాయింట్‌కు స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, డీటీ నిమ్మల శేఖరం, ఎమ్మార్ఐ రాంబాబు, వంశధార ప్రాజెక్టు, ఏపీఎండీసీ సిబ్బంది ఉన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం ప్రాణాంతకం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై రమేష్

బలిజిపేట: మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని ఏఎస్సై రమేష్ తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వెంగాపురం పీఎస్ఎన్ కళాశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే విచక్షణ కోల్పోతారని చెప్పారు. లైసెన్స్‌లు లేనివారు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలున్నా.. ఎవరు ఇబ్బంది పెట్టినా వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, మణి, వికాస్, తదితరులు పాల్గొన్నారు.